

నిలిచిన చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్మన్ పదవికి మంగళవారం నిర్వహించిన ఎన్నిక నిలిచిపోయింది. ఇప్పటికి నాలుగోసారి చైర్మన్ ఎన్నిక వాయిదా పడడం. వైసిపి, కూటమి పార్టీలు ప్రతిష్టకు పోవడంతో ఈ ఎన్నిక నిలిచిపోయింది. వైసిపికి సంఖ్యా బలం ఉండడంతో చైర్మన్ పదవి తమకే కావాలని పట్టుబట్టగా, అధికారంలో ఉన్నామని, ఎలాగైనా చైర్మన్ పదవిని దక్కించుకోవాలని కూటమి నాయకులు పట్టుపడుతున్నారు, ఎప్పటి లాగే మంగళవారం కూడా కౌన్సిలర్లు ఎక్కువ మంది గైర్హాజరవ్వడంతో కోరం లేక ఎన్నిక నిలిపివేస్తున్నట్టు ఎన్నికల అధికారి సి.యశ్వంత్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులు జాయింట్ కలెక్టర్ శోభిక ప్రకటించారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- దూసుకుపోతున్న విజయగౌరి
- మద్దతుగా తాజా, మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - విజయనగరం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు మరో 8రోజులు మాత్రమే గడువు ఉండడంతో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ఈనెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరుగనున్న విషయం తెలిసిందే. ఎన్నికకు సమయం సమీపిస్తుండడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ప్రచారం చేపడుతూనే, మరోవైపు ఉపాధ్యాయుల ఇళ్లకూ వెళ్లి ప్రచారం చేస్తుండడం గమనార్హం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా పోటీ యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, పాకలపాటి రఘువర్మ(ఎపిటిఎఫ్), గాదె శ్రీనివాసులు నాయుడు (పిఆర్‌టియు) మధ్యే పోటీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పనితీరును, గతంలో ఎమ్మెల్సీగా రెండు పర్యాయాలు పనిచేసిన గాదె శ్రీనివాసుల నాయుడు పనితీరును అంచనా వేసుకున్న ఉపాధ్యాయులు ఈసారి కోరెడ్ల విజయగౌరి వైపు మొగ్గు చూపుతున్నారు. అంపశయ్య మీద ఉన్న విద్యారంగాన్ని కాపాడుకునే యత్నంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పలు జిఒల రద్దుకు పోరాటం చేయడంతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం ప్రభుత్వాన్ని కదిలించేలా చేయాల్సిన అవసరముందని ఉపాధ్యాయ సంఘాలు భావిస్తున్నాయి.

యుటిఎఫ్ బలపర్చిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ప్రజాతంత్ర, ఉపాధ్యాయుల సమస్యలపైనా ఉద్యమాలు చేపట్టిన మహిళగా అందరిలోనూ మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో సమస్యలపై అధ్యయనం, ప్రభుత్వాల విధానాల వల్ల విద్యారంగానికి జరగబోయే కష్ట, నష్టాలపై పలుమార్లు ఉత్తరాంధ్ర స్థాయిలో గొంతెత్తిన చరిత్ర ఆమెకు ఉంది. ఐటిడిఎల పరిధిలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు చేపట్టిన పోరాటాలకు అండగా ఉండడంతో పాటు ధర్నాలు, నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలోనే పిడిఎఫ్ అభ్యర్థులందరూ ఉద్యమాభిలాషతో ముందుకు సాగిన వారే అయినందున టీచర్ల నుంచి ఆమెకు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే విజయగౌరి ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లోని పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ పలుమార్లు సందర్శించి తనను గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులను కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం జిల్లాలో ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్సీ బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు శాసన మండలి సభల్లో ఉపాధ్యాయుల తరపున గొంతెత్తాల్సిన వీరు పాలక పక్షాలకు భజన చేస్తూ 'ఇద్దరూ ఇద్దరే' అనేలా వ్యవహరించడం టీచర్లందరిలోనూ తాజాగా చర్చ సాగుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి పార్టీల మద్దతు నాకంటే నాకు అనుకుంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని సైతం వీరు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పోటీపడి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి వత్తాసుగా నిలవడమే వ్యాపకంగా మారిపోయింది. జాతీయ విద్యావిధానం పేరుతో ఢిల్లీ నుంచి రాష్ట్రాల విద్యాహక్కులను, విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్న బిజెపికి చెందిన విశాఖ నాయకుడు పివిఎన్.మాధవ్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో మోడీ విధానాల అడుగులకు మడుగులొత్తుతూ విద్యా వ్యవస్థను కలుషితం చేసేందుకు సిద్ధమైన టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పిడిఎఫ్ అభ్యర్థుల ఉద్యమ స్ఫూర్తితో కోరెడ్ల విజయగౌరి ముందుకు సాగుతున్నారు. ఆమె విజయంతోనే తమ సమస్యలు పరిష్కారం కావచ్చనే అంచనాలో ఉపాధ్యాయులు ఉన్నారు.



వీరఘట్టంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు

తాజా, మాజీ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ నాయకుల ప్రచారం

మరోవైపు విజయగౌరి గెలుపు కోసం ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మంగళవారం మన్యం జిల్లాలో ప్రచారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం విజయనగరం జిల్లాలో పర్యటించి పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు వెళ్లి ప్రచారం చేపట్టారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించి శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతు వినిపించేందుకు విజయగౌరిని గెలిపించాలని కోరారు. యుటిఎఫ్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఉత్తరాంధ్ర నుంచి శాసనమండలికి తొలిసారి మహిళా అభ్యర్థిగా పోటీలో ఉన్న విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా విశేష స్పందన లభిస్తోంది.

విజయగౌరిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఐవి ప్రచారం

వీరఘట్టం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు ఓటర్లను కోరారు. ఈ మేరకు ఆయన గుమ్మలక్ష్మీపురం, వీరఘట్టం, సీతంపేట, పాలకొండ మండలాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. వీరఘట్టంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాడిన ఏకైక వ్యక్తి విజయగౌరి అని ఆయన అన్నారు. చట్టసభల్లో సమస్యల కోసం గళమెత్తే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అవసరమని, మీరంతా ఒక్కసారి ఆలోచించి మీ మొదటి ప్రాధాన్యత ఓటు విజయగౌరికే వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అధ్యాపకులను కోరారు. అనంతరం తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ప్రచారం చేశారు.. అనంతరం మంగళవారం రాత్రి వీరఘట్టంలోని గాజుల కస్పా, ఎస్సీ, అక్కులపేట, వీధుల్లో కోరెడ్ల విజయ గౌరీని గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు.

గుమ్మలక్ష్మీపురం : ఉపాధ్యాయుల గొంతుకగా నిలిచే కోరెడ్ల విజయ గౌరిని ఎమ్మెల్సీగా గెలిపించాలని గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. రేగిడి, టిక్కబాయి, పి.ఆమిటి, డిగ్రీ కళాశాల, గురుకుల కళాశాలలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేసే విజయగౌరిని గెలిపించడం ద్వారా శాసన మండలిలో మన సమస్యలపై ప్రశ్నించగలరని అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కారానికి కృషి చేసే కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపించాలని కోరారు. ఈ ప్రచారం కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, జిల్లా కార్యదర్శి కూర్మారావు, మండల అధ్యక్షులు పత్తిక ప్రసాదరావు, నాయకులు చలపతిరావు ఉన్నారు.

రీసర్వే పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామం లో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని లచ్చయ్య పేటలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. మ్యాప్‌లో గ్రామ భూ విస్తీర్ణం, ఇప్పటి వరకు పూర్తి చేసిన సర్వే, ఇంకా చేపట్టనున్న సర్వే వివరాలను మండల సర్వేయర్ చంద్రరావును అడిగి తెలుసుకున్నారు. భూమి కొలతలు వేసేముందు రైతులకు ఫాం -19 నోటీసులు ఇస్తున్నదీ, లేనిది, అడంగల్‌లోని రైతుల పేరున ఉన్న భూ విస్తీర్ణం కచ్చితంగా కొలతలు వేస్తున్నారా, లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి రైతులకు భూమిని అప్పగించాలని సూచించారు. నోటీసులు తీసుకునేందుకు అందుబాటులో లేని రైతులకు వాట్సాప్ ద్వారా జారీ చేయాలన్నారు. రీ సర్వే కొలతల్లో తేడా రాకుండా రైతులు చూసుకోవాలని కోరారు. రీసర్వే ఎప్పటిలోగా పూర్తి చేస్తారని తహశీల్దార్ ప్రసన్న కుమార్‌ను కలెక్టర్ ప్రశ్నించగా ఈ నెల 26 నాటికి సర్వే ప్రక్రియను పూర్తికానున్నదని తెలిపారు. ఇప్పటి వరకు 450 ఎకరాలు సర్వే పూర్తికాగా, మరో 430 ఎకరాలు పూర్తి కావల్సి ఉందని వివరించారు. ఖచ్చితత్వంతో కూడిన (గ్రౌండ్ ట్రూత్ నింగ్) రీసర్వేను పక్కాగా పూర్తి చేయాలన్నారు. సర్వేలో పొరపాట్లకు తావివ్వరాదని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఉపతహశీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, విలేజ్ సర్వేయర్ మన్మధరావు, వీఆర్వో కిరణ్, సర్వేయర్ల బందం, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.



లచ్చయ్యపేటలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సర్వే ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి

బలిజిపేట : రీసర్వే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. మండలంలోని శివరాంపురాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా పక్కాగా చేపట్టాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. తొలుత రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వచ్చిన సమస్యలపై అధికారులతో సమీక్షించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పద్ధతి ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ప్రతి సమస్య లేదా ఫిర్యాదుపై ఎండార్స్ మెంట్ వేయాలని, సరైన శాశ్వత పరిష్కారం చూపాలని హితవు పలికారు. మ్యూటేషన్లు, సబ్ డివిజన్లు, మొబైల్ లింకింగ్ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో తహశీల్దార్ కె.రత్నకుమార్, రెవెన్యూ, సర్వే, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంబరవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు సచివాలయం పరిధి కంబరవలసలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి చేసిన

టిడిపి నాయకుడ్ని శిక్షించాలి

మండల కార్యాలయాల వద్ద జర్నలిస్టుల ధర్నా

ప్రజాశక్తి - కురుపాం

మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుపై దాడి చేసిన టిడిపి మక్కువ మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడును కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లాలోని పలు మండలాల్లో జర్నలిస్టు సంఘాలు రెవెన్యూ కార్యాలయాల వద్ద మంగళవారం నిరసన తెలిపాయి. ఇందులో భాగంగా కురుపాం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నాయకులు మాట్లాడుతూ టిడిపి వ్యతిరేక వార్తలు రాస్తున్నారన్న కక్షతో ప్రజాశక్తి విలేఖరి రామారావుపై దాడి చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. రామారావును కొట్టడమే కాకుండా చంపుతామని బెదిరిస్తున్నారని, దీంతో రామారావుకు ప్రాణహాని ఉందని, ఆయనకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకుడు కొల్లి గంగు నాయుడు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి నేతపై చర్యలు చేపట్టకపోతే ఉద్యమ కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కురుపాం ప్రెస్ క్లబ్ సభ్యులు నెల్లి శ్రీనివాసరావు, డి.ప్రదీప్, ఎం.పృథ్వీ, సంతు, బి.అనిల్, రామకష్ణ, మణి, మణికంఠ, జి.డిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : ప్రజాశక్తి మక్కువ మండల విలేకరిపై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు విలేకరులు ర్యాలీ నిర్వహించి ఎస్సై ఎస్ సింహాచలం కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘం నాయకులు మాట్లాడుతూ విలేకరిపై దాడికి పాల్పడిన టిడిపి నాయకుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు లక్ష్మణరావు, నాయుడు, మురళీ, జైరాం, నారాయణరావు, ఎస్.పోలి నాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు సంఘీభావం తెలిపారు.

సీతానగరం: మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి రామారావుపై మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాల నాయుడు దాడి చేయడాన్ని ఖండిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులు, ప్రజా సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన టిడిపి నాయకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు డి.నారాయణరావు, పి.సతీష్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు రెడ్డి వేణు, ఈశ్వరరావు, వెంకటరమణ, రమణమూర్తి, బి.అప్పారావు, ఎస్.శంకర్రారావు, వైరామారావు, బి.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



కురుపాం : తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న జర్నలిస్టులు

పార్వతీపురం టౌన్ : మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడి అత్యంత హేయమైన చర్యని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన చేపట్టారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయండని, టిడిపి మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడుపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్, ముట్నూరు వెంకటరమణ, స్థానికులు పాలల్గొన్నారు.

పాచిపెంట : ప్రజాశక్తి విలేకరిపై దాడిని ఖండిస్తూ పాచిపెంటలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.ఈశ్వరరావు, ఎ.శ్రీనివాస్, లంక తవుడు తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేటలో నిరసన ప్రదర్శన చేస్తున్న జర్నలిస్టులు

మన్యం అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

21న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లా అభివృద్ధికి ఈనెల 28న జరగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశంలో రూ.10 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈనెల 21న జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మన్యం జిల్లా తీవ్రమైన అన్యాయానికి గురైందని, పాలించిందెవరైనా అన్యాయం జరుగుతుందని, బడ్జెట్‌లో కేటాయింపులు ఉండవని, ఒకవేళ కేటాయించినా ఖర్చు చేయరని అన్నారు. పాలకుల వివక్షతోనే ఈనాటికీ జంఝావతి అలాగే ఉందన్నారు. ఒడిశా భూమి 300 ఎకరాలు మునుగుతాయని 50 ఏళ్లుగా నిలిచిపోయిందన్నారు. అలాగే అడారుగెడ్డ, పెద్దగెడ్డ, వెంగళారాయ, తోటపల్లి, గుమ్మిడిగెడ్డ, పాలగెడ్డ, కంచరుగెడ్డ, జంపరుకోట ఇలా ఏ ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని, రెండు దశాబ్దాలైనా తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసితుల పునరావాసం పూర్తి చేయలేదన్నారు. కాలువలు పూర్తి చేయరని, గుమ్మడి గెడ్డపై ప్రాజెక్టు నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో తెలీదని విమర్శించారు. ఈ జిల్లాలో యూనివర్సిటీ, పీజీ, మెడికల్ కాలేజీలు లేవని, దీంతో ప్రైవేట్ కాలేజీల్లో వేలకు వేలు డబ్బులిచ్చి చదువుకోవాల్సి వస్తుందని తెలిపారు. విద్యావసతి, ఫీజు రీయింబర్స్మెంట్ కూడా రాదని, పేదలైన జిల్లా ప్రజలు చదివేది ఎలాగని ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రాలైన సాలూరు, పాలకొండ, కురుపాంలో సూపర్‌స్పెషాలిటీ హాస్పిటళ్లు లేకపోవడంతో అనారోగ్యం చేస్తే పేదలను విజయనగరం, విశాఖ కెజిహెచ్‌కు పంపిస్తున్నారని, కావున గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందేలా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, కావున బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లన్నీ పూర్తి చేయాలంటే మన్యం జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తే జిల్లా సస్యశ్యామలవు తుందన్నారు. వీటన్నింటిపై ఈనెల 21న జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల్లో కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నామని, బడ్జెట్లో నిధులు కేటాయించకపోతే భవిష్యత్తు కార్య చరణ రూపొందించి ఆందోళన చేపడతామని అన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు కె.సీతారాం, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

లచ్చయ్యపేటలో పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి, తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అలాగే పెన్షన్ తనిఖీలను ఎంపిడిఇఒ త్రివిక్రమరావు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పోస్టల్ ప్రైవేటీకరణ చర్యలు వెంటనే ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తపాలా శాఖలో జరుగుతున్న ప్రైవేటీకరణ చర్యలను వెంటనే ఆపాలని పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జెఎసి కార్యాచరణ సంఘం పిలుపుమేరకు మూడు రోజుల పాటు బ్యాడ్జీలు ధరించి నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రధాన పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిడిఎస్ ఉద్యోగులకు 8వ పేకమిషన్ అమలు చేయాలని, కమలేష్ చంద్ర కమిటీలోని సానుకూల అంశాలను వెంటనే అమలు చేయాలని, ఐడిసిసిడిసి ప్రతిపాదలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రవీంద్రనాథ, బి.ఉమాశంకర్, ఎం.అప్పారావు, గౌరీశంకరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

మలేరియా రోగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మలేరియా నిర్మూలనలో సమూల చికిత్స చాలా ముఖ్యమని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సి పరిధిలోని అంటివలసలో ఇటీవల మలేరియాకు గురైన సష్మిత్ పాల్ అనే బాలుడ్ని పరామర్శించి ఆయన పిల్లలు, గర్భిణుల్లో మలేరియా రాకుండా చూడాలని స్థానిక సూపర్‌వైజర్ జయగౌడ్‌ను ఆదేశించారు. ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పిహెచ్‌సి పరిస్థితిని గురించి వైద్యాధికారి శ్రీకాంత్‌తో మాట్లాడారు. ల్యాబ్‌ను తనిఖీ చేసి రక్తపూతల సేకరణ శత శాతం జరగాలన్నారు.

కెవికెలో వ్యవసాయ సలహా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

2025-26లో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందించబోయే సేవలు ప్రణాళికలు తయారీపై మంగళవారం 41వ శాస్త్రీయ వ్యవసాయ సలహా కమిటీ సమావేశం కెవికె ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.ధ్రువ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సహాయ ప్రబంధకులు డాక్టర్ అప్పలనాయుడు, వ్యవసాయ విస్తరణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ముకుందరావు ప్రణాళిక తయారీపై పలు సూచనలు, సలహాలు చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి పరిశ్రమలో అధిక లాభాలు రైతులు పొందేలా 2025-26 వ్యవసాయ సంవత్సరం ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ పరికరాలు వినియోగిస్తూ అధిక దిగుబడి పొందడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు సూచించారు. సీజన్ల వారీగా రైతులకు ఉపయోగపడే అవగాహనా కార్యక్రమాలు, విత్తనాలు, పంటలపై ఎప్పటికప్పుడు సూచనలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యవసాయ, గృహ విజ్ఞానం, పశుసంవర్ధక, ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవికె ప్రోగ్రాం అధికారి ధ్రువ

విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేసున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు



హాస్టళ్ల విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. పట్టణంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయ, వైద్య సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు చేపట్టిన హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై ఆరా తీశారు. విద్యార్థుల హీమోగ్లోబిన్ పరీక్షల నివేదికలను రికార్డులో తనిఖీ చేసి గత నెలల నివేదికలతో పోల్చి చూశారు. భవిత కార్డుల్లో నమోదు వివరాలు పరిశీలించారు. రక్త శాతం వృద్ధి చెందిన విద్యార్థులు, రక్తహీనతగా గుర్తించిన విద్యార్థుల వివరాలు పరిశీలించారు. వీరికి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలన్నారు. హాస్టల్‌లో సిక్‌రూమ్, సిక్ రిజిస్టర్ పక్కగా నిర్వహించాలని విద్యార్థుల్లో ఏ చిన్న అనారోగ్య సమస్య గుర్తించినా తక్షణమే స్పందించాలన్నారు. పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఆరోగ్యానికి పరిశుభ్రత ప్రధానమన్నారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలో ఆయుష్మాన్ భారత్ టెలి మెడిసిన్ హబ్ సందర్శించి ఇ-సంజీవిని సేవలపై అక్కడ వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రతి రోజూ నమోదు అవుతున్న టెలి కాల్స్ వివరాలు పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు తదితరులు ఉన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ కొనసాగించాలి

ప్రజాశక్తి - పాలకొండ

పేదలకు ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం విద్యుత్ విద్యుత్ పథకాన్ని కొనసాగించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విద్యుత్‌శాఖ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద కెవిపిఎస్, సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్లో ఉచిత కరెంటు ఇచ్చి, ఇప్పుడు వేలకు వేలు రూపాయలు చెల్లించమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మింగేసి మోడీతో కలిసి పేద ప్రజలను దోపిడీ చేస్తావా బాబు? అంటూ నినదించారు. ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకి 200 యూనిట్ల వరకుఉచితంగా విద్యుత్ ఇచ్చిందని, ఇప్పుడు బడ్జెట్ మొత్తం వేలాది రూపాయలు కట్టమనడం దుర్మార్గమైన చర్యలు అని అన్నారు. ఇంత పెద్దమొత్తంలో బిల్లులు చెల్లించలేని వారి ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం అమానుషమన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్‌కొనసాగించాలని, ఇప్పటికే వసూళ్లు చేసిన డబ్బులను ఆయా కుటుంబాలకు వాపస్ చేయాలని, విద్యుత్ సరఫరా నిలిపివేసిన కుటుంబాలకు తక్షణమే పునరుద్దరించాలని, విద్యుత్ భారాలు మోపే విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ డిఇకి వినతిని అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ 200 యూనిట్ల లోపల ఉన్న వారందరికీ ఉచిత విద్యుత్తు కొనసాగిస్తామని, తప్పుడు బిల్లులు ఏమైనా వస్తే సరి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు, విద్యుత్ వినియోగదారులు టి.పార్వతి, కె.ఆదినారాయణ, కె.స్వాతి, టి.స్వాతి, కె.సిరి, హెచ్.శ్రీను, జి.సత్యం, పాలకొండ, ఎన్‌కె రాజపురం గ్రామాలకు చెందిన దళిత మహిళలు పాల్గొన్నారు.



డిఇ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

భూ ఆక్రమణదారులపై అట్రాసిటీ కేసు పెట్టాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎన్నో ఏళ్లగా సాగు చేస్తున్న తమకు పట్టాలివ్వాలని, తమ భూములను ఆక్రమించిన సుతాపల్లి రాముపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మండలంలోని కరాసవలస దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యవసాయకార్మిక జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులు సాగు చేస్తున్న భూమిలో సాలూరు పట్టణానికి చెందిన నాగోలు సన్యాసిరావుకు ఏ విధంగా పట్టాలిచ్చారని, సాగు చేస్తున్న దళిత రైతులకు పట్టాలివ్వకుండా ఈ భూములతో సంబంధం లేని వ్యక్తులకు ఎలా సంక్రమించాయని ప్రశ్నించారు. ఈ భూములను సాగు చేస్తున్న దళితులను అన్యాయంగా ఆ భూమి పైకి రాకుండా కొంత మంది గిరిజనులను రెచ్చగొట్టి కొట్టిస్తున్న సుతాపల్లి రాముపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సాగు చేస్తున్న భూమిని కాజేయాలని దురుద్దేశంతో రాము దౌర్జన్యం చేయడం, గిరిజనులను దళితులపై దాడి చేయించడం, వారి భూముల్లో ఉన్న చెట్లను నరికేయడం దళితులపై దాడి కొట్టడం వంటి విషయాలన్నీ జిల్లా కలెక్టర్, తహశీల్దార్, రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దళితుల ఆందోళన చేయడంతో అధికారులు ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రోజులు గడుస్తున్నా పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదని తెలిపారు. ఈ గ్రామాలతో సంబంధం లేని సాలూరు పట్టణానికి చెందిన నాగుల సన్యాసిరావుకు ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని, సుతాపల్లి రాము క్వారీ చుట్టూ ఆక్రమించిన దళిత, గిరిజన పేదల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని రాముపై తగు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు గిరిజన, దళితులకు పంచి పెట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ ప్రాంతంలోని దళిత, గిరిజనులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు, కరాసవలస దళితులు సలంబరికి సింహాచలం, బోడియ్య, కోనవలస గౌరీష్, రామజన్ని సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న దళితులు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వివాహం అనంతరం ప్రభుత్వ లబ్ధి పొందే కుటుంబాలు రాష్ట్రంలో లక్షల్లో ఉన్నాయని, వీటికి రేషన్ కార్డుల ప్రక్రియ లేనందున ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాలో లెక్కలేకుండా పోతున్నారని, వెంటనే ప్రక్రియ చేపట్టాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ కొత్త దంపతులకు రేషన్ కార్డు నమోదు గుదిబండగా మారుతుందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన వెంటనే జూలై, ఆగస్టు నెలల్లో మంజూరు చేస్తానని ప్రకటించినా, నేటికీ పురోగతి లేదన్నారు. గత బడ్జెట్ నుంచి కొత్త రేషన్ కార్డులు లేకపోవడంతో ఆధార్ కార్డుల మార్పిడిగానే కొత్త పెళ్లి చదువులకు, కుల ధ్రువీకరణ పత్రాలకు, ఆరోగ్య బీమాలకు, గృహప్రయోజనకర వినియోగాలకు, తదితర దరఖాస్తులకు సమస్యగా మారుతుందని తెలిపారు. కావున ఇప్పటికైనా కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ మొదలు పెట్టాలని, కొత్త కార్డు దరఖాస్తుల ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ పాల్గొన్నారు..

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశీల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఐశ్వర్య వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో ఎవరికైనా మలేరియా, మసూచి వంటి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యుల సహాయం తీసుకోవాలని, పాఠశాలలోనే ఒక సిక్ రూం ఏర్పాటు చేసి ఐసోలేషన్‌లో ఉంచాలని, ఇటువంటి వారిపై వైద్య సిబ్బంది నిత్యం వైద్య సేవలందిస్తారని ఈ సందర్భంగా ఆమె ప్రధానోపాధ్యాయులు గోవిందరావుకు, వసతి గృహ సంరక్షకుడు రమేష్‌కు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

రీ సర్వే వేగవంతం : ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

రీ సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు వీఆర్‌ఒలు సహకరించాలన్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. అదే విధంగా గృహ నిర్మాణాలకు సంబంధించిన ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని వీఆర్‌ఒలకు సూచించారు. వీఆర్‌ఒలు మంజూరు చేసిన ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ లను వెంటనే ఆన్ లైన్లో అప్ లోడ్ చేసి గృహనిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎఇకి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ గీతాంజలి, వ్యవసాయశాఖ ఎఒ శ్రీదేవి, హౌసింగ్ ఎఇ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న చినబాబు

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : ఎపిఒ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎపిఒ జి.చినబాబు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల్లో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అదే విధంగా విద్యార్థులు బాగా చదవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లను ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. మరమ్మతులకు గురైన కొళాయిలను వెంటనే బాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిడి ఎం.అన్నదొర, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వసంత లక్ష్మి, వసతి గృహ అధికారిని పాలక అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెదపెంకిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో సాయిరాం మందిరం వద్ద మరిశర్ల అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరానికి శ్రీకాకుళం జిల్లా రాగాలు జెమ్స్ హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ రాకేష్, అరుణదీపిక రోగులకు పరీక్షలు నిర్వహించారు. నేత్ర చికిత్సలకు 18మంది ఎంపికయ్యారు. వీరికి జెమ్స్ హాస్పిటల్‌లో కంటి ఆపరేషన్లు నిర్వహించి తిరిగి వారి గ్రామానికి పంపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమం క్యాంపు కో ఆర్డినేటర్ వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ గుళ్లిపల్లి రామారావు, గంట సాధు, డాక్టర్ శ్రీను, గొర్లె శ్రావణ్, కోట గౌరీనాథ్, పెంకి పరశురాం పాల్గొన్నారు.

గిరిజనుల భూముల్లో జీడి మొక్కల తొలగింపు ఆపండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని సంగంవలస పంచాయతీ సీతంపేట గిరిజనులు సాగు భూముల్లో వేసుకున్న జీడి మొక్కలను తొలగింపును వెంటనే ఆపాలని స్థానిక ఎమ్మెల్యే బి.విజయ్ చంద్ర అటవీ శాఖ అధికారులను కోరారు. సోమవారం సీతంపేట గిరిజనులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి 25 ఏళ్లుగా తమకు జీవనోపాధి అయిన జీడి మొక్కలను అటవీ శాఖ అధికారులు ఆకస్మికంగా వచ్చి యంత్రాలతో తొలగిస్తున్నారని, దీనివల్ల తాము ఉపాధి కోల్పోయి వీధినపడే పరిస్థితి ఉందని ఎమ్మెల్యేకు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి తాను క్షేత్రస్థాయిలో పర్యటించి విషయాన్ని ప్రభుత్వానికి తెలియచేస్తానని, అంతవరకు జీడిమొక్కల తొలగింపును ఆపాలని కోరగా అందుకు అటవీ శాఖ అధికారులు సమ్మతించారు.

తాడికొండలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బుద్దేశ్వరరావు రోగులకు కంటి పరీక్షలు చేశారు. కేటరాటక్ట్ ఆపరేషన్‌కు ఆరుగుర్ని గుర్తించామని, వారిని ఆపరేషన్‌కు తీసుకెళున్నామని తెలిపారు. వైద్యాధికారి బుద్దేశ్వరారావు మాట్లాడుతూ ఏజెన్సీలో చాలా మందికి కంటి సమస్యలు వస్తున్నాయని, వీరు బయట ఊర్లకు వెళ్లకుండా ఇక్కడే ఉండిపోతున్నారని, కావున అటువంటి తాడికొండలో వైద్య శిబిరం నిర్వహించినప్పుడు ఇక్కడకు వచ్చి చూపించుకోవాలి కోరారు. కార్యక్రమంలో పుష్పగిరి ఆసుపత్రి సిబ్బంది సిహెచ్ఒ పద్మ , వైద్య సిబ్బంది హెచ్ఎస్ శ్రీను, ఎర్రయమ్మ ఉన్నారు.

రెడ్డివానివలసలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రెడ్డివానివలసలో మండల వ్యవసాయ అధికారి వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ మొక్కజొన్న పంటలో మెలుకువలు తెలిపారు. మొక్కజొన్న సాగుకు సారవంతమైన, నీరు ఇంకే నల్ల రేగడి నెలలు అనుకూలమైనవని, నీరు నిల్వ ఉండే భూములు పనికిరావని, విత్తన మోతాదు 8 కేజీలు ఒక ఎకరానికి వేసుకోవాలని తెలిపారు. కిలో విత్తానానికి 3 గ్రాముల మంకోజెబ్, థైరం, కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకున్నట్టు అయితే లేత దశలో మొక్కలకు తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. విత్తే సమయంలో 1/3 వంతు నత్రజని, భాస్వరం, 1/2 వంతు పొటాష్ ఎరువుని వేసుకోవాలని సూచించారు. అలాగే పంట సాగు పట్ల అవగాహన కల్పించారు.


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ

పాఠశాలను సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కారిమానుగూడ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం స్థానిక ఎంపిడిఒ కె.గీతాంజలి సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు సింహాద్రి, పిల్లలతో కాసేపు మాట్లాడారు. రెండో తరగతి విద్యార్థిని సుచిత్రను బోర్డుపై ఇచ్చిన లెక్కను పూరించమని సామర్థ్యం తెలుసుకున్నారు. అనంతరం ఎగువ కారిమానుగూడలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను పర్యవేక్షించారు. కుడ్డపల్లిలో అంగన్వాడీ పాఠశాలను సందర్శించారు. ఈ కేంద్రం వెనుక వీధిలో ఎస్‌డబ్ల్యూ పిసి సిసి రోడ్డు పనులను పరిశీలించారు. గ్రామ సచివాలయంలో జరుగుతున్న జిఎస్‌డబ్ల్యూఎస్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయం సిబ్బందితో సమీక్షించారు. ముఖ్యంగా చిల్డ్రన్ విదౌట్ ఆధార్ (ఆధార్ నంబర్ నమోదు కాని పిల్లలకు ఆధార్ నంబరు హౌస్ హెూల్డ్ డేటా బేస్ లో అప్డేట్ కాని వారికి), ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా జరుగుతున్న సర్వేలో అప్డేట్ చేయించుకోవాలని కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి వై.పాపారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో చెట్లు నరకడం తప్పే : డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలోని పెదబుడ్డిడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్ పేరిట అవసరం లేని చెట్లు నరకడం తప్పేనని జిల్లా ఉప విద్యా శాఖాధికారి పి.కృష్ణమూర్తి అన్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈనెల 15న పలు పత్రికల్లో వచ్చిన పాఠశాల ఆవరణలో చెట్లు అక్రమ నరికివేత అన్న వార్తపై ఆయన విచారణ చేపట్టారు. తొలుత పాఠశాల ఆవరణలో నరికిన 63 చెట్లను పరిశీలించారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి చెట్లు అడ్డంగా ఉన్నాయని గుత్తేదారుల ద్వారా నరికివేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిప్యూటీ డిఇఒను డిమాండ్ చేశారు. చెట్లు నరకడం మీకు తెలిసే జరిగిందా? తెలియక జరిగిందా అడిగిన ప్రశ్నకు పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానం ప్రకారం చెట్లు నరికినట్టు హెచ్ఎం చెప్పడంపై డిప్యూటీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు రెండు రోజుల్లో సమగ్ర నివేదిక అందజేస్తానని డిప్యూటీ డిఈవో తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాల చుట్టూ వ్యవసాయం చేసుకుంటున్న రైతులు తమకు గతంలో వలె పాఠశాల మధ్య నుంచి రహదారి విడిచిపెట్టాలని డిప్యూటీ డిఇఒను కోరగా ఇది రెవెన్యూ పరిధిలో విషయమని, వారితో రైతులు మాట్లాడి ఆ ప్రాప్తికి నిర్ణయం తీసుకోవాలని ఆయన చెప్పారు.


విచారణ చేపడుతున్న డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి

దీర్ఘకాలిక రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం

ప్రజాశక్తి - సీతానగరం

దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు ఆయుర్వేదంతో మంచి ఫలితాలు ఉంటాయని బూర్జ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పలు అనారోగ్య లక్షణాలు, సమస్యలతో శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు డాక్టర్ హేమాక్షి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను స్పష్టంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా వాత వ్యాధులు, జీర్ణ సంబంధిత సమస్యలు, శ్వాసకోశ రుగ్మతలు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు తనిఖీలు నిర్వహించి ఆయుర్వేద మందులు అందజేశారు. వృద్ధులు, మధ్య వయస్కులు శిబిరాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారన్నారు. మందులు ఉపయోగించు విధానాన్ని వారికి వివరించారు. డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ మన పరిసరాల్లో అనేక ఆయుర్వేద ఔషధ గుణాలున్న మొక్కలు ఉన్నాయని, ప్రాచీన కాలం నుంచి మన ఆయుర్వేద వైద్య విధానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దీర్ఘకాలికంగా ఇబ్బంది పెడుతున్న పలు రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం కలుగుతుందని, అలాగే మన శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుందని అవగాహన కల్పించారు. ప్రస్తుత జీవన విధానంలో యోగా అలవాటు చేసుకోవాలని మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతర క్షయ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ ఎఎన్ఎం పద్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోగులకు వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ఖరీఫ్‌కు ముందు నవధాన్యాల సాగు మేలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఖరీఫ్‌కు ముందు జూన్ మొదటి వారంలో 30 రకాల నవధాన్యాలు కలిపి సాగు చేయడం వల్ల రైతులకు, పంటకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ తెలిపారు. మండలంలోని ఖడ్గవలస, నాగూరులో మంగళవారం ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. నవధాన్యాల సాగు వల్ల నేల గుల్లబారి మెత్తగా మారి వరి పంటకు అవసరమైన సారవంతమందించడం జరుగుతుందని తెలిపారు. నేలలో వానపాములు సంఖ్య పెరుగుతున్నాయని, ప్రధాన పంట వరిలో అజోల్లా, నత్రజని లభించడంతో పాటు కలుపురావడం లేదని, పురుగులు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండి పంట దిగుబడులు బాగా వస్తున్నాయని తెలిపారు. ఖర్చులు బాగా తగ్గాయని, ఈ విధంగా గ్రామంలోని మొత్తం రైతులు వేసుకోవడం వల్ల రైతులు కె.చంద్రశేఖర్, బొచ్చ సింహాచలం, జోగినాయుడు, ఎం.రేగునాయుడు తమ అనుభవాలను వివరించారు. మంత్రబుడ్డి, రేగునాయుడు పొలంలో రబీ డ్రైసోయింగులో భాగంగా పలు రకాల విత్తనాలు వేయడం జరిగింది. అనంతరం.జి.హేమ సుందర్ మాట్లాడుతూ ప్రతి రైతు శాస్త్రవేత్తగా ఎదగాలని, ఇతర రైతులకు ఆదర్శవంతంగా ఉండాలని, ప్రకృతికి భూమికి నష్టం కలిగించే ఏ విధమైన కార్యక్రమాలు చేయరాదని, అలా చేస్తే అంతా నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్న పూర్ణ, మండల్ ఇన్చార్జి వి.పోలినాయుడు, వెంకటనాయుడు, రైతులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న నందివానివలస గ్రామస్తులు

భాష, గణిత బోధనపై శిక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

భాషా గణిత బోధనపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 120 రోజుల పాటు రెండు విడతలుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణా కాలం అనంతరం కార్యకర్తలకు ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తుందన్నారు. శిక్షణ పొందిన ఐదుగురు రిసోర్స్‌పర్సన్ల ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 3నుంచి 5ఏళ్లలోపు పిల్లలకు భాష, గణితం బోధిస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు బి.మహేష్, టి.శంకర్రావు, ఎం.గణపతి, అష్టలక్ష్మి, పైడిరాజు, అంగన్వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం: అక్షరాస్యత సంఖ్యా భావనలు పిల్లలకు నేర్పించడమే సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, సానుకూల అభ్యాసన అనుభవాలు అందించడం ప్రధాన ముఖ్యోద్దేశమని ఎంఇఒ-2, కోర్స్ డైరెక్టర్ ఆర్ ఆనందరావు అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానికజిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. ఈనెల 18 ,19 ,20, 23 ,24,25 తేదీల్లో ఆన్లైన్ ఆఫ్లైన్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ ఎం.పైడిరాజు, ఆర్.ధనుంజయ నాయుడు, బి.రాజేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జె జ్ఞానమ్మ, ఎన్ రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు జి.సూర్యదేవుడు, ఎం.వెంకటరమణ అన్నారు. మండలంలోని కెజిబివి పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన శిక్షణా కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా బాల్య సంరక్షణ విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అంగన్వాడీ వర్కర్ల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే 3 నుంచి 8 ఏళ్లలోపు పిల్లల శారీరక, మానసిక మేధోభివృద్ధికి కృషిలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తామన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు, ఆర్పీలు పి .కూర్మినాయుడు. సిహెచ్ గణపతి, కెజిబివి ఎస్ఒ జె.సంధ్య తదితరులు పాల్గొన్నారు.


పాచిపెంటలో శిక్షణ ఇస్తున్న ఆర్‌పిలు

ఎంఎస్ఎంఇ రుణాలకు పేర్లు నమోదు

బొబ్బిలి : ఎంఎస్ఎంఇ రుణాలు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలో సచివాలయాలను మంగళవారం సందర్శించి ఎంఎస్ఎంఇ పేర్లు నమోదుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారులు, ఫర్మ్ ఉన్న వారు ఎంఎస్ఎంఇ రుణాలు కోసం సచివాలయాలలో పేర్లు నమోదు చేసుకుంటే ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఆధార్, వ్యాపారం వివరాలతో సచివాలయాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 1200 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గరుగుబిల్లి మండలం నందివానివలస గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఈ మేరకు మంగళవారం గుమ్మలక్ష్మీపురం టిడిపి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. గతంలో గృహ నిర్మాణం ద్వారా గ్రామంలో 80 కుటుంబాలకు ఇంటి గ్రాంట్లు మంజూరయ్యాయని తెలిపారు. అయితే స్థలం లేక ఆగిపోయాయని, ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం భూమిసేకరించి కొత్త ప్రదేశంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వందశాతం అక్షరాస్యతే లక్ష్యంగా ఉల్లాస్

వయోజన విద్య ఉప సంచాలకులు సోమేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వంద శాతం అక్షరాస్యతే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం చేపట్టామని వయోజన విద్య ఉప సంచాలకులు అల్లు సోమేశ్వరరావు అన్నారు. మంగళవారం విజయనగరం, పూసపాటిరేగ మండలాల్లో ఉల్లాస్ ప్రోగ్రామ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉల్లాస్ ప్రోగ్రాం ద్వారా 48578 మంది పొదుపు సంఘాల మహిళలు, అంగన్వాడీ ఆయాలు, మధ్యాహ్న బోజన పథకం కార్మికులను గుర్తించామన్నారు. వారిలో అక్షరాస్యతను పెంచేందుకు 4857 మంది వాలంటీర్లు నియమించామన్నారు. ఆర్థికంగా జరుగుతున్న మోసాలు, డిజిటల్ అక్షరాస్యత గురించి రూపొందించిన వీడియోలను చూపిస్తూ వివరించారు. కార్యక్రమంలో ఎం ఎల్ ఓ హరీష్, ఈశ్వరరావు, వాలంటీర్ మేరి కుమారి పాల్గొన్నారు.